క్లుప్తంగా

శాసనమండలి చైర్మన్‌తో ఎమ్మెల్సీ వంక భేటీ



శాసనమండలి చైర్మన్ మోషేనురాజుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

భీమవరం: శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజును భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వానికి చేయాల్సిన సూచనలపై చర్చించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

ఆర్థిక సాయం

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో కొత్త ఇళ్లు నిర్మించుకున్న నలుగురు లబ్ధిదారులకు వేగేశ్న నర్సింహరాజు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీ వెంకటరాయవర్మ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో ఎవరు ఇల్లు నిర్మించుకున్నా వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం ట్రస్ట్ తరపున అందజేస్తుంటారు. ఈ క్రమంలో గృహాలు నిర్మించుకున్న నలుగురికి కోటమటిగుంట గ్రామ సర్పంచ్ భవనం భాగ్యశ్రీ శివకుమార్, కోలనపల్లి ఎంపీటీసీ వేగేశ్న సత్యనారాయణరాజు చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు.

రాంపండుకు సత్కారం



భీమవరంలో రాంపండును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొండాడ రామమోహన్ రావు (రాంపండు)ను ది భీమవరం ఫైనాన్స్ అండ్ చిట్ ఫండ్స్ ప్రొప్రయిటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఛాంబర్స్ భవనంలో ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఆకివీడు: మద్యం అక్రమ అమ్మకాల్లో పట్టుపడ్డ మూడు వాహనాల్ని స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద మంగళవారం బహిరంగ వేలం వేశారు. ఈ వాహనాల వేలం ద్వారా రూ.61,420 ఆదాయం వచ్చినట్లు స్థానిక సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.కాత్యాయని చెప్పారు. జిల్లా ఏఈఎస్ ఆర్సీహెచ్. చిట్టిబాబు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా ఎస్సై జే యుగంధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలి

భీమవరం: కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని భీమవరం ఆలిండియా లాయర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం భీమవరంలో కొత్త క్రిమినల్ చట్టాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా కొత్త చట్టాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టాలు రూపొందించే సమయంలో ఎటువంటి చర్చ పార్లమెంట్‌లో జరగకుండా ఆమోదించడం ప్రజలకు జీవన విధానానికి ప్రమాదమన్నారు. కొత్త చుట్టాలు కోర్టుల అధికారాలను తగ్గించి ఎగ్జిక్యూటివ్ అధికారాలను పెంచుతున్నాయని అన్నారు. పాలకులు చేసే చట్ట వ్యతిరేక పనులకు అడ్డుకట్ట వేసుకోవడం కోసమే



భీమవరంలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు

జ్యుడీషియల్ అధికారాలు కొత్త చట్టంలో తగ్గించారని ఆరోపించారు. కేవలం అధికారంలో ఉన్న పార్టీ నాయకులు ప్రతిపక్షం, ప్రజలపై కక్ష సాధింపు చర్యలు కోసం కొత్త చట్టాలను రూపొందించుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కామన నాగేశ్వరరావు, ఆర్ కాస్ట్రో, ఎ అంబేద్కర్, జి వెంకటేశ్వరరావు, పీజే కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుపై భారీ గోతుల వద్ద నిరసన

భీమవరం అర్బన్: మండలంలో వెంప–బేతపూడి రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా తయారైందని వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులకు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని కరుకువాడ బేతపూడి మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రోడ్డు మార్గం నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో భారీ గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివారం వెంప గ్రామానికి చెందిన ఇంటి ప్రకాష్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మరణించినట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుపై గోతులను పూడ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెదపాటి జయనంద రావు వేగి మోహన్‌రావు పాల్గొన్నారు.



కరుకువాడ బేతపూడిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత

కాళ్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యుడు సరాబు సునీల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం డెంగీ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. కొబ్బరిబొండాలు, వాడేసిన టైర్లు, ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదముందని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే పీహెచ్‌సీని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద క్షయ వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీఎస్ బీ సుజనా, ఎస్టీఎల్ఎస్ కే చంద్ర దొరరెడ్డి వైద్య సిబ్బందికి శిక్షణ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ డీ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులతోపాటు ఎన్‌సీసీ క్యాడెట్లు అందించిన సేవలు అభినందనీయమని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. ఎన్నికల్లో సేవలందించిన ఎన్‌సీసీ క్యాడెట్లకు మంగళవారం ప్రశంసాపత్రాలను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఓటు నమోదు నుంచి కౌంటింగ్ వరకు ఎన్‌సీసీ క్యాడెట్లు సహాయ సహకారాలు అందించడం గొప్ప విశేషమన్నారు. ప్రిన్సిపాల్ జి మోజేష్ మాట్లాడుతూ జాతీయ కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు సేవలందించడం ఆదర్శనీయమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్లు మూడు నెలలపాటు ఓటు నమోదు నుంచి కౌంటింగ్ వరకు పోలీసు శాఖకు ఎంతో సహకరించిన 26 మందికి ప్రశంసా పత్రాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, పి.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ వీరయ్య పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



శాకాంబరి అలంకరణలో వారాహి మాత

ఆకివీడు: స్థానిక పిల్లలమర్రి అగ్రహారంలోని వల్లీ దేవసేన సమేత వేంకట లింగేశ్వర స్వామి ఆలయంలో వారాహి మాతకు మంగళవారం అర్చకులు మొవ్వ సుబ్రహ్మణ్య రవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలు, డ్రైఫ్రూట్స్, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్కే.రసూల్ బీబీ హుస్సేన్, కౌన్సిలర్ నిమ్మల నాగు, బొల్లా శ్వేత, ఓలేటి సుబ్రహ్మణ్యం, బొల్లా కేశవ, చందా కేశవ, ఈరి లక్ష్మి, పసుపులేటి మణికంఠ, సుబ్బారావు, నిమ్మల ద్వారకా, పలువురు మహిళలు, మాలాధారులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తం



గొల్లవానితిప్పలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల వృద్ధిని అరికట్టాలని, డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ ఇన్‌ఛార్జి వైద్యాధికారి హసితా అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేయడంతో పాటు బ్లీచింగ్ గ్రామ సిబ్బందితో చల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్‌పీహెచ్‌ఈవో కె. అప్పారావు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డెంగీ, డయేరియాను తరిమికొడదాం

ఆకివీడు: పరిసరాల పరిశుభ్రతతో డెంగీ, డయేరియాని వంటి వ్యాధులను తరిమికొట్టాలని వైద్యాధికారిణి బీ.గోవర్థిని అన్నారు. చెరుకువాడ శివారు కమతవానిగూడెంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తచర్యలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి పదార్థాలను తినడం ద్వారా డయేరియా నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. ఈఓపీఆర్‌డీ సుబ్బారావు మాట్లాడుతూ పంచాయతీల ద్వారా బ్లీచింగ్ చల్లాలని, క్లోరినేషన్ చేసి మంచినీటిని సరఫరా చేయాలని సూచించారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ భూషణం, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ విన్న సరోజిని, ఏఎన్ఎం కృపాలతరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల స్థలాలపై పరిశీలన



పెన్నాడ చెత్త సమస్యను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో బాలాజీ

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో అనధికార లేఅవుట్‌లను, డంపింగ్ యార్డు స్థలాన్ని మంగళవారం భీమవరం డివిజనల్ పంచాయతీ అధికారి చీకట్ల బాలాజీ తనిఖీ చేశారు. దళిత నాయకుడు కోరం మునలయ్య ఇచ్చిన ఫిర్యాదును పురస్కరించకుని డీఎల్‌పీఓ ఈమేరకు తనిఖీలు చేపట్టారు. పంచాయతీ గతంలో ఏర్పాటు చేసిన వేసవి బావులను కొందరు ఆక్రమించుకుని పంచాయతీ స్థలంలో ఏకంగా గోడ నిర్మించారని ఇచ్చిన ఫిర్యాదును ఆయన పరిశీలించారు. అనంతరం మెయిన్ రోడ్డుపై శ్మశానవాటిక వద్ద గల డంపింగ్ యార్డును పరిశీలించారు. అనధికార లేఅవుట్ స్థలాలను తనిఖీ చేశారు. ఈ స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మిను ఆదేశించారు. డీఎల్‌పీవో వెంట మండల విస్తరణాధికారి ఆంజనేయులు కూడా ఉన్నారు.

సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

భీమవరం అర్బన్: సీసీఆర్‌సీ (కౌలు గుర్తింపు కార్డులు)లకు దరఖాస్తు చేసుకోవాల్సిన కౌలు రైతులు తమ గ్రామంలో వీఆర్వో, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని తహసీల్దార్ శివకుమార్, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కౌలు గుర్తింపుకార్డు ఉన్న రైతులకు పంటల బీమా, ధాన్యం కొనుగోలుకు, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కౌలు రైతులు తప్పకుండా సీసీఆర్‌సీ కార్డులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పాలేశ్వరరావు



పాలేశ్వరరావును అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాలకోడేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకోడేరు మండలం నూతన అధ్యక్షుడిగా కోరుకొల్లుకు చెందిన సన్నిధి పాలేశ్వరరావు ఎన్నికయ్యారు. సోమవారం నిర్వ హించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పాలేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. కార్యదర్శిగా గేనెళ్ల పురుషోత్తం, కోశాధి కారిగా గేనెళ్ల పురుషోత్తం, కోశాధికారిగా రత్నం ఎన్నికయ్యారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ ప్రతినిధి పాపారావు నాయుడు హాజరైనట్లు చెప్పారు. క్లబ్ తరపున మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ అధ్యక్షుడు వెంకటరాజు పాల్గొన్నారు.

పొగాకు వినియోగాన్ని నిషేధించాలి



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: పొగాకు తినడం, నమలడం, తాగడం అనారోగ్యమని, తీవ్ర రుగ్మతలకు లోనవుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగాన్ని నిషేధించండి, ఉప ఉత్పత్తుల్ని రద్దు చేయండి అని నినాదాలు చేశారు. పాఠశాల హెచ్ఎం విక్రమ్ మాట్లాడుతూ గుట్కా, పాన్ పరాగ్, ఖైనీ, జర్దా, సిగరెట్‌లు, చట్టల వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు. ఈ హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ, కానిస్టేబుల్ గజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: వ్యక్తి అదృశ్యంపై ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం చెరుకువాడకు చెందిన యేలేటి కృపావరం (50) మతి స్థిమితం లేకపోవడంతో 2017 జూలై 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతనికోసం వెదికినా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య విజయలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

పెంటపాడు: కుటుంబ నియంత్రణతో సమాజానికి మేలు జరుగుతుందని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు తోట రాజేష్, వి. మౌనిక పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరుగురి మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు.

ఉపాధ్యాయుల కొరతతో బోధనపై ప్రభావం

భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటు వెంటనే పూర్తి చేయాలని డీఈవో జి.నాగమణికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాబాజీ సాహెబ్, రమణ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో అనేక పాఠశాలల్లో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల సర్దుబాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలకు నిధులు సకాలంలో విడుదలకాక పాఠశాలల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారమవుతోందని, త్వరగా స్కూల్ మెయింటినెన్స్ నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ నాగమణి త్వరలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఎస్‌వీ సుభాషిణి, వేమూరి శ్రీవల్లి, పెద్దాడ రాజేశ్వరరావు, పి నాగరాజు పాల్గొన్నారు.



భీమవరంలో డీఈవో నాగమణికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

భీమవరం: జరిమానా తప్పించుకోవడానికో, పోలీసుల కోసమో కాదు, భద్రత, భవిష్యత్తు కోసం వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని భీమవరం ట్రాఫిక్ సీఐ జి.దాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌ఆర్‌ఎస్ కళాశాల ఎస్ఎస్ఎస్ విద్యార్థులతో శ్రీవిజ్ఞాన వేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి – సురక్షితంగా ప్రయాణించండంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని తద్వారా ప్రమాదాల కొని తెచ్చుకోవద్దన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రతి ఏటా వందల మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రక్షణ కవచంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాల నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రసూన, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అరవిందస్వామి, పి అమూల్యరావు, ధనుంజయ్ పాల్గొన్నారు.



హెల్మెట్‌ధారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఉండి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మానవత స్వచ్ఛంద సంస్థ మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మానవత సేవాసంస్థ అభివృద్ధి, విస్తరణ కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు మానవత సంస్థ కృషి చేస్తుందన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షుడిగా పెన్మెత్స రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా గాదిరాజు రంగరాజు, కోశాధికారిగా కట్రెడ్డి తాండవ నాగసత్యనారాయణ, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు, ఎంపీడీవో ఎస్ రవీంద్ర, ఈవోపీఆర్డీ రామకృష్ణారెడ్డి, యువరాజు, నాగబాబు, దంగేటి రామలింగేశ్వరరావు, నరేంద్ర బాబు, తాటిపర్తి పెదవీరప్ప, గాదిరాజు వెంకటేశ్వరరాజు, పెన్మత్స రంగప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన మానవత నూతన కార్యవర్గం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భీమవరం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ చెట్టు కొమ్మలు తొలగించడం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణం, ప్రకృతి ఆశ్రమం రోడ్డు, చిన్నరంగని పాలెం, రాజుల పేట, బొక్కా వారిపాలెం, మారుతి నగర్, నెహ్రూ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అహ్మద్‌ఖాన్ తెలిపారు.